




స్థానిక ఎన్నికలపై బీజేపీ దృష్టి

- రైతు సమస్యలపై ఆందోళనలకు సిద్ధం
- నేడు, రేపు గ్రామాల్లో రచ్చబండలు
- పంచాయతీల్లో పాగా వేయడమే లక్ష్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటడమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు రూపొందించుకుంటున్నది. పంచాయతీల్లో పాగా వేయడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని పటిష్టపరుచుకోవాలని ఆ పార్టీ భావిస్తున్నది. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ స్థానాలను అధిక సంఖ్యలో సాధించడాని ఆ పార్టీ ప్రయత్నాలు ప్రారంభించింది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ మేరకు పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్నదని, బీఆర్‌ఎస్ పూర్తిగా డీలా పడిందని, రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం ఉన్న ఈ పరిస్థితులను తమకు అనువుగా మార్చుకొని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన నాయకులకు చెప్పినట్లు సమాచారం. రైతు రుణమాఫీ ఇప్పటికీ సక్రమంగా జరుగక పోవడం, వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నా రైతు భరోసా పథకం కింద ఎకరాకు ఏడున్నర వేల పెట్టుబడి సాయం అందించక పోవడంతో రైతులు పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారని బీజేపీ భావిస్తోంది. రైతాంగ సమస్యలను, ఇతర సమస్యలపై ఈనెల 7,8 తేదీల్లో గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. గ్రామాల్లో రైతులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని కూడా ఆ పార్టీ భావిస్తున్నది.



పోలింగ్ బూత్‌లవారీగా ఓట్ల విశ్లేషణ

త్వరలో రాష్ట్రంలో రెండు పెద్ద బహిరంగ సభలను నిర్వహించాలని నిర్ణయించిన బీజేపీ పోలింగ్ బూత్‌లవారిగా లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను విశ్లేషించుకొని స్థానిక ఎన్నికల వ్యూహాన్ని రూపొందించుకోవాలని నిర్ణయించింది. పార్టీ ఆదేశాల మేరకు

జిల్లాలో బీజేపీ స్థానిక సంస్థల్లో మెజార్టీ స్థానాలను సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించింది. జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకంటే ఎక్కువ ఓట్లను పొందింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క స్థానాన్ని కూడా పొందలేకపోయినా పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం అందరి అంచనాలను మించి ఓట్లను తెచ్చుకున్నది. ఎంపీగా గెలుపొందిన బండి సంజయ్‌కుమార్ కేంద్రంలో హోంశాఖ సహాయమంత్రి పదవిని చేపట్టడంతో ఆయన స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థుల గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారని సమాచారం. ఇప్పటికే ఆయన జిల్లా కార్యవర్గం, పదాధికారుల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నేతృత్వంలో రైతుల ఆందోళనలు, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించి ముందుకు సాగుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 1,23,127 ఓట్లతో, చొప్పదండిలో 94,992 ఓట్లతో, హుజూరాబాద్‌లో 73,280 ఓట్లతో, మానకొండూర్‌లో 77,282 ఓట్లతో బీజేపీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ రెండో స్థానంలో, బీఆర్‌ఎస్ మూడో స్థానంలో నిలిచాయి. 90 శాతం బూత్‌లలో ఆధిక్యాన్ని చాటుకున్న బీజేపీ బూత్ కమిటీలను మరింత చైతన్యపరిచి క్రియాశీలం చేసి అధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు సిద్ధమవుతున్నది.

● త్వరలో శక్తి కేంద్రాల సమావేశాలు

త్వరలోనే బూత్ కమిటీలు, శక్తి కేంద్రాల సమావేశాలను నిర్వహించి స్థానిక ఎన్నికల వ్యూహాన్ని వారికి వివరించనున్నట్లు సమాచారం. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో కూడా కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్ బీజేపీ స్థానిక సంస్థలను గెలుచుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేశారని చెబుతున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో మినహా మిగతా ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ అత్యధిక ఓట్లను పొంది మొదటిస్థానంలో నిలిచింది. హుస్నాబాద్‌లో మొదటి స్థానంలో నిలిచిన కాంగ్రెస్ హుజూరాబాద్, కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో రెండో స్థానానికి, మిగతా రెండు నియోజకవర్గాల్లో మూడో స్థానానికి పరిమితమైంది. బీఆర్‌ఎస్ సిరిసిల్ల నియోజకవర్గంలో మాత్రమే రెండో స్థానాన్ని దక్కించుకోగా మిగతా అన్ని నియోజకవర్గాల్లో మూడో స్థానానికి పరిమితమైంది. ప్రస్తుతం బీజేపీ కాంగ్రెస్ పార్టీనే ప్రధాన పోటీదారుగా భావిస్తోంది. రాజకీయవర్గాలు మాత్రం స్థానిక ఎన్నికల నాటికి పరిస్థితులు మారుతాయని, పార్లమెంట్ ఎన్నికల నాటి వాతావరణం ఉండక పోవచ్చని అంటున్నాయి. మూడు పార్టీలు పోటీలో ఉంటాయని, స్థానిక సంస్థల ఎన్నికలైనందు వల్ల స్థానికంగా ప్రజలతో సత్సంబంధాలున్న ఇండిపెండెంట్లు కూడా గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ స్థానిక ఎన్నికలపై ఇప్పటికే కొంత కసరత్తు ప్రారంభించగా బీఆర్‌ఎస్‌లో మాత్రం ఇంకా ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తే పరిస్థితులు మారే అవకాశం ఉంది.

తల్లిపాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం



ఫకీర్ పేటలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న ఆర్డీవో మహేశ్వర్

కరీంనగర్ రూరల్, ఆగస్టు7: తల్లి పాలతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఆర్డీవో కె మహేశ్వర్ అన్నారు. మండలంలో ఫకీర్ పేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు తాగించాలన్నారు. ఆరు నెలల నుంచి తల్లి పాలతోపాటు అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ప్రత్యేకాధికారి నళినీకాంత్, పంచాయతీ కార్యదర్శి దేవిక, అంగన్‌వాడీ టీచర్ నీల, ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ, వీవో రాధ, ఆశా కార్యకర్త రాజమణి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం



పీడీఎస్‌యూ జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 7: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి అన్నారు. నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ఆరు వేల కోట్ల రూపాయల ఫీజు రీ యింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయిస్తామని భావిస్తే ఆరు శాతం మాత్రమే కేటాయించి విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందేందుకు కుట్రలు పన్నుతుందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు సమస్యతో బాధపడుతున్నారన్నారు. శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్, కళ్యాణ్, రాకేష్, సందీప్, నవీన్, శివ, సతీష్, రోహిత్, కిరణ్‌బాబు, మోహన్, జగన్, సంజీవ్ పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ ఎదుర్కొంటున్న వారిని బాధ్యతల నుంచి తప్పించాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 7: శాతవాహన విశ్వవిద్యాలయంలో విజిలెన్స్ విచారణ ఎదుర్కొంటున్న అధికారులను వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రికి హైదరాబాద్‌లో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా కొందరు అధికారులు యూనివర్సిటీలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వాహనాల కొనుగోళ్లు, చాలన్ల పేరుతో లక్షల రూపాయల దుర్వినియోగం చేశారని విమర్శించారు. పరీక్ష పేపర్ లీకేజీలు, టెండర్ లేకుండా పరీక్షల జవాబు పత్రాల స్కానింగ్‌ను ఓ సంస్థకు ఇవ్వడం, బోధనేతర సిబ్బంది పీఎఫ్ డబ్బులు జమ చేయకపోవడం.. ఇలా చాలా అవకతవకలు జరిగాయన్నారు. అనేక అంశాలపై ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటిక్యాల రామకృష్ణ, యూనివర్సిటీల ఇన్‌చార్జి రహమాన్, జిల్లా అధ్యక్షుడు రామరాపు వెంకటేష్, కార్యదర్శి మచ్చ రమేష్ పాల్గొన్నారు.

చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం చేయూత

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



శాలపల్లి గ్రామంలో చేనేత విగ్రహం వద్ద బీజేపీ నాయకులు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 8: చేనేత రంగానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎల్లవేళలా చేయూతను అందిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని శాలపల్లి గ్రామంలో బుధవారం బీజేపీ నాయకులు చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చేనేత విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కృష్ణారెడ్డి మాటాడుతూ చేనేత కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో చేనేత రంగాభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాముల కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు సాయిబాబా, జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేష్, బూత్ అధ్యక్షుడు వేల్పుల కుమార్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి బండారి లావణ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు జడల చిరంజీవి పాల్గొన్నారు.

విత్తన కంపెనీల దోపిడీని అరికట్టాలి

● రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్

జమ్మికుంట రూరల్, ఆగస్టు 7: బహుళ జాతి విత్తన కంపెనీల దోపిడీని అరికట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో విత్తనోత్పత్తి రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాగర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విత్తనోత్పత్తి రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయ న్నారు. ప్రపంచ దేశాలకు విత్తనాలు అందిస్తున్న రాష్ట్రం మనదే అన్నారు. ఇక్కడి వాతవరణం, సమ శీతోష్ణస్థితి కారణంగా విత్తనాలను రెండు దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్నామన్నారు. విత్తన రైతులకు పటిష్ట చట్టం లేక పోవడం వల్ల విత్తన కంపనీల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. 1966లో చేసిన చట్టమే నేటికి అమలు అవుతుందన్నారు. అది ఆనాడు విదేశాల నుంచి దిగుమతి కోసం చేసిన చట్టమని, ప్రస్తుతం మనం ఎగుమతి చేసే స్థాయికి వచ్చామన్నారు. మనకు పటిష్ట రైతు రక్షణ చట్టం అవసరం అన్నారు. లాభాలు అన్నీ కంపనీలకు పోతే నష్టాలను రైతులు భరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన రైతులకు పంటల బీమా, రైతు బీమా ప్రీమియం కంపనీలే చెల్లించాలన్నారు. విత్తన రైతులకు శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించి శిక్షణ ఇప్పించాలని కోరారు. విత్తన రైతులకు పెట్టుబడికి అనుగుణంగా బ్యాంకులు, సహకార సంఘాలు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి, చల్లారపు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు బాసిర సంపత్‌రావు, గుండేటి వాసుదేవ్, సహాయ కార్యదర్శి శీలం అశోక్, నాయకులు జూనుతల జనార్దన్‌రెడ్డి, చెలుపురి రాములు, రాయిత లింగారెడ్డి, రమాదేవి, పిట్టల తిరుపతి, మొగిలి, యుగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తీగల సాగర్.

నేతన్నలే చేనేత ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్లు

● ప్రజావాణి కార్యక్రమంలో చేనేత స్టాల్ ఏర్పాటుకు అవకాశం కల్పిస్తా

● కలెక్టర్ పమేలా సత్పతి



అధికారులతో సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నేత కార్మికులే చేనేత ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్లని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో చేనేత స్టాల్‌ను ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. నేత కార్మికులు వస్త్రాలనే కాకుండా చిన్నచిన్న బ్యాడ్జీలను తయారు చేస్తే వాటిని రాష్ట్ర, జాతీయ ఫార్మేషన్ డే కార్యక్రమంలో వినియోగిస్తామన్నారు. ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ చేనేత వృత్తికి పునరుజ్జీవం పోసే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. మేయర్ వై సునీల్‌రావు మాట్లాడుతూ నేటి అభిరుచులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలన్నారు. వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి, చేనేత కార్మికులను సన్మానించారు. అనంతరం పావలా వడ్డీ పథకం 2021-22 సంవత్సరానికి గాను 20 సంఘాల కు రూపాయలు 16,19,011 రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏడీ హ్యాండ్‌లూమ్ చరణ్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ సువార్త, సంక్షేమ అధికారి సరస్వతి, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ పాల్గొన్నారు.

● లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలి

ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలను రెన్యువల్ చేసుకునే రైతులను ఇబ్బందిపెట్టొదన్నారు. వివిధ శాఖల్లో ఇన్‌ఆపరేటివ్‌గా ఉన్న బ్యాంకు ఖాతాల నుంచి జరిపే లావాదేవీలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ఆంజనేయులు, డీఆర్డీవో శ్రీధర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం నవీన్, డీడబ్ల్యూవో సరస్వతి పాల్గొన్నారు.

● ఈవీఎంల తనిఖీ

ఈవీఎంల గోదాంను బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బీఆర్‌ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, టీడీపీ ప్రతినిధి కళ్యాడపు [illegible] పాల్గొన్నారు.



రాట్నం వడుకుతున్న కలెక్టర్

'పెండింగ్ డీఏలను విడుదల చేయాలి'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయడంతోపాటు పీఆర్సీ నివేదిక మేరకు 54 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ప్రధాన కార్యదర్శి అన్నమనేని తిరుపతిరావు డిమాండ్ చేశారు. బుధవారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిపోయిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 1010 పద్దు కింద ప్రతి నెలా 1న జీతాలు చెల్లించాలని, సర్వీసులో ఉండి మరణించిన సిబ్బందికి డెత్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. హైకోర్టులో ఉన్న పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కె హరిచరణ్, జిల్లా కార్యదర్శులు ఆర్ శ్రీనివాస్, కృష్ణమూర్తి, చొప్పదండి మండల అధ్యక్షుడు సాయన్న పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7: కరీంనగర్‌లో రెండు రోజుల కిందట వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడిన కేసులో నిందితుడు మహారాష్ట్ర అమరావతి జిల్లా వరుడ్ ప్రాంతానికి చెందిన దుర్వ అజయ్(20)ను బుధవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. నిందితుడు ఒక వైన్ షాపులో 35 వేల నగదును దొంగిలించాడని, తన అనుచరులతో కలిసి మరో వైన్ షాపులో చోరీకి ప్రయత్నించినట్లు తెలిపారు. నిందితుడిని ఉజ్వలపార్క్ సమీపంలో అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.20 వేల నగదు, సికింద్రాబాద్‌లో దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

వీధి కుక్క దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన చిన్నారి హరినందన్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: నగరంలో శాతవాహన యూనివర్సిటీ రోడ్డులోని ఆర్ఆర్ బాంక్విట్ హాల్ ముందు బుధవారం సాయంత్రం రెండేళ్ల వయసు కలిగిన చిన్నారిపై వీధి కుక్క ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. జీవనోపాధి కోసం తంగళ్ళపల్లి పద్మ, వినోద్ అనే దంపతులు కరీంనగర్‌కు వచ్చి కుటుంబంతో జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడు తంగళ్ళపల్లి హరినందన్‌ను అమ్మమ్మ ఆడిస్తుండగా రోడ్డుపై నుంచి వెళ్తున్న వీధి కుక్క దాడి చేసింది.

దీంతో చిన్నారి ముఖం, చేతులపై గాయాలు కాగా కుక్కను అమ్మమ్మతో పాటు అక్కడున్న వారు కుక్కను వెళ్ల గొట్టే ప్రయత్నం చేస్తున్నా బాబును వదిలిపెట్టలేదు. చివరకు ఇటుకలు, రాళ్ళను కుక్కపైకి విసరడంతో చిన్నారిని వదిలిపెట్టి కుక్క వెళ్లింది. స్పృహ కోల్పోయిన చిన్నారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, తమ కళ్లముందే చిన్నారిపై కుక్క దాడి చేయడంతో తల్లిదండ్రులు, అమ్మమ్మ తీవ్రంగా విలపించారు. వీధి కుక్కల బెడదను నివారించి దాడికి గురైన చిన్నారికి మెరుగైన చికిత్స ను అందించి, వారి కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని స్థానికులు కోరారు.

హమాలీలపై కుక్కల దాడి

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని కొత్త కూరగాయల మార్కెట్‌లో బుధవారం ఇద్దరు హమాలీలపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో పరమేశ్వర్ అనే హమాలీకి వీపు, తొంటి భాగంలో తీవ్రంగా గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడ ఉన్న మిగతా వారు కుక్కలను తరిమికొట్టారు. గాయాలైన పరమేశ్వర్‌ను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి చికిత్స నిమిత్తం పంపించారు.

శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి/ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 6,752 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.75 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 12 టీఎంసీల నీరు మిడ్‌మానేరుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 17.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.25 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి మధ్యమానేరు నుంచి నీరు వస్తుండగా రెండు మోటర్ల ద్వారా ప్రతి రోజు 3400క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కు 3,600 క్యూసెక్కుల నీరు వెళుతుందని డీఈ దేవేందర్ తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌ను పూర్తిగా నింపిన తర్వాత మండలానికి ఉపయోగపడతాయనుకుంటే గతంలో మాదిరిగానే రంగనాయకసాగర్‌కు ఎక్కువ నీటిని విడుదల చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీఫార్మసీ పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఆగస్టు 7: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై- 2024 లో నిర్వహించిన బీఫార్మసీ ఏడవ, ఎనిమిదో సెమిస్టర్ పరీక్షల ఫలితాల ను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఈ ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in.లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట, ఆగస్టు 7: ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్లను వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కోరపల్లిలో 2, సాయి గార్డెన్ దగ్గర 1, ధర్మారం 4, మొత్తం ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వేణు, మహేందర్, పరుశురాము, ప్రవీణ్ కుమార్, తిరు పతి, వి తిరుపతి, కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

సైబర్ వలలో ప్రభుత్వ ఉద్యోగి



సారంగాపూర్, ఆగస్టు 7: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ర్యాగల శివప్రసాద్ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నాడు. పనిఒత్తిడిలో భాగంగా తన ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్‌లను ఓపెన్ చేస్తున్న క్రమంలో తన వాట్సప్‌కు ఓ బ్యాంకుకు సంబంధించిన లోగోతో లింక్ వచ్చింది. బ్యాంకు సంబంధించినది అనుకుని ఓపెన్ చేయగా ఏటీఎం పిన్‌ఎంటర్ చేయమని అడగగా ఎంటర్ చేశాడు. దీంతో తన ఖాతా నుంచి రూ. 40 వేలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించిన శివప్రసాద్ బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకుని సైబర్‌క్రైం అధికారులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బ్యాంకుకు సంబంధించిన లోగోతో కూడిన మెసేజ్ రావడంతో ఓపెన్ చేసి మోసపోయినట్లు బాధితుడు శివప్రసాద్ పేర్కొన్నారు.

దుంపెట వాసి ఖాతా నుంచి రూ.1.13లక్షలు..

కథలాపూర్: మండలంలోని దుంపెటకు చెందిన ఓ వ్యక్తి సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...దుంపెటకు చెందిన వ్యక్తికి వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ మెసేజ్ రాగా దాన్ని క్లిక్ చేశాడు. దీంతో 20 దఫాలుగా ఖాతా నుంచి రూ. 1,13,804లు గుర్తు తెలియని వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. యూనియన్ బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొంటూ వచ్చిన మెసేజ్‌కు స్పందించడం వల్ల సైబర్ నేరగాళ్లు డబ్బులు మాయం చేశారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించ వద్దని సూచించారు.


రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

బుగ్గారం ఆగస్టు7: మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో ఓ వృద్ధుడు రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరా ల మేరకు చిన్నాపూర్ గ్రామానికి చెందిన కలమడుగు వెంకయ్య (76) బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తన ఇంటి ముందు గల జాతీయ రహదారికి అవతలివైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ధర్మపురి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరుగడంతో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు కలమడుగు నర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

గల్ఫ్ కార్మికుడికి ప్రభుత్వ విప్ అండ

సిరిసిల్లక్రైం, ఆగస్టు 7: సౌదీలో అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ అనే 23ఏళ్ల యువకుడికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అండగా నిలిచారు. ఇమ్రాన్ స్వదేశా నికి వచ్చేందుకు అయ్యే విమాన టికెట్లు, ఇతర ఖర్చులను స్వయంగా భరిస్తానని బుధవారం తెలిపారు. ఇమ్రాన్‌ను త్వరలో స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బుధవారం సౌదీలో ఉన్న ఎన్ఆర్ఐ భైరి యాదవ్‌ను ఇమ్రాన్ వద్దకు పంపించి సురక్షితంగా ఇంటికి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఇండియాకు వచ్చేందుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఇమ్రాన్ వీడియో విడుదల చేశాడు.

జలపాతంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


హర్షిత్ (ఫైల్)

తిర్యాణి, ఆగస్టు 7: తిర్యాణి మండలంలోని గుండాల జలపాతంలో సోమవారం గల్లంతైన పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన రిషి హర్షిత్(18) మృతదేహం బుధవారం జలపాతం మడుగులో లభ్యమైంది. మిత్రులతో కలిసి సోమవారం జలపాతం చూడటానికి వచ్చిన రిషి సెల్ఫీ తీసుకునే క్రమంలో జలపాతంలో జారిపడి గల్లంతయ్యాడు. రెండు రోజులపాటు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి బుధవారం మృతదేహన్ని వెలికి తీశారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై రమేష్‌లు పరిశీలించి రిషి మృతదేహన్ని తిర్యాణి పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ జలపాతాలకు వచ్చే సందర్శకులు జాగ్రత్తలు పాటించాలని, జాగ్రత్తలు తీసుకోకుండా ఈత రాని వారు నీటిలో దిగి సెల్ఫీలు దిగడం, రీల్స్ చేయడం వంటి వి చేపట్టకూడదన్నారు. మృతుడు సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

గంగాధర, ఆగస్టు 7: గంగాధర మండలం కురిక్యాలకు చెందిన అబ్బిడి అనిల్‌రెడ్డి(30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కురిక్యాల గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కుంగిపోయి మంగళవారం గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ తరలించగా మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేట మండలంలోని వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి మత్తులో పడొద్దు

తాండ్ర్యాల యువకుడి రిమాండ్

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కథలాపూర్, ఆగస్టు 7: గంజాయి మత్తులో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు సూచించారు. బుధవారం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో తాండ్ర్యాలకు చెందిన కాసారపు వర్ధన్ అనే యువకుడు బుధవారం గంజాయి సరఫరా చేస్తుండగా ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో పట్టుకోగా రిమాండ్ వివరాలను వివ రించారు. గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి పలు గ్రామాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్టు సమాచారం రావడంతో పోసాని పేట శివారులో 160 గ్రాముల గంజాయితో వర్ధన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి సేవించడం, విక్రయించడం వంటివి చేసి యువత భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. నిందితుడిని పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ సురేశ్ బాబు, ఎస్సై నవీన్, కానిస్టేబుల్ పురుషోత్తం, నవీన్‌ను అభినందించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

యువకుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

చొప్పదండి, ఆగస్టు 7: పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఓ యువకుడి ఇంటి ఎదుట ఓ యువతి బైఠాయించింది. ఎస్ఐ అనూష కథనం మేరకు.. చొప్పదండికి చెందిన చిటిపాక విక్రమ్‌కు మల్యాల మండలం తాటిపెల్లికి చెందిన యువతితో రెండేళ్ల క్రితం వివాహం నిశ్చయమైంది. తాను దుబాయి వెళ్లి వచ్చిన తరువాత పెళ్లి చేసుకుంటానని చెప్పిన విక్రమ్ ఆ తరువాత మాట మార్చి వేరే అమ్మాయితో వివాహం కుదుర్చుకొన్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువతి విక్రమ్ ఇంటి ఎదుట బైఠాయించింది. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించం

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ

సుభాష్‌నగర్, ఆగస్టు 7: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సూర్యం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పోకడలు పోతోందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలను విస్మరించి బడ్జెట్‌ను ప్రవేశాపెట్టిందన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం విద్య రంగానికి ఒక్క శాతం నిధులు మాత్రమే పెంచిందన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం విద్యారంగంలో పనిచేసే ప్రభుత్వ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది జీతభత్యాలకే సరిపోతాయన్నారు. నూతన గురుకులాలకు సొంత భవనాలు, స్థలాల కేటాయింపు ఇప్పటివరకు జరగలేదన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల పరి స్థితి అస్తవ్యస్తంగా ఉందని వారు విమర్శించారు. యూనివ ర్సిటీల్లో కనీసం వైస్ చాన్సలర్లు, బోధన సిబ్బంది లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు నేటికీ విడుదల చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు, మెస్, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని కోరారు.

స్టూడెంట్ మెనేజ్‌మెంట్ హాస్టల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్స్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులందరికీ ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విద్యారంగంలో మతభావాలను వ్యాపింపచేస్తోందని వారు ఆరోపించారు. నిరుద్యోగ అంశాన్ని పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు అ న్యాయం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లైన్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, జిల్లా నేతలు ముల్కల మారుతి, లోకిని రమేశ్, సన్నీ, రాజేశ్, గణేశ్, రవికుమార్, దేవేందర్, మధుసూదన్, సాయి, స్వప్న, వందన పాల్గొన్నారు.

ఆర్థిక వివాదాలతో జర్నలిస్టు ఆత్మహత్య

తన మృతికి బిల్డర్ భార్య, మరో వ్యక్తి కారణమంటూ ఎమ్మెల్యేకు లేఖ


మధునయ్య (ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 7: గోదావరిఖనికి చెందిన సీనియర్ జర్నలిస్టు, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నాయిని మధునయ్య(62) ఆర్థిక వివాదాలతో బుధవారం తెల్లవారుజామున హనుమాన్‌నగర్‌లోని తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు కొచ్చెర్ల ప్రవీణ్ అనే బిల్డర్ భార్య లలిత, పెద్దపల్లి పోషయ్యలు కారణమని పేర్కొన్నారు. ఈ మేరకు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పేర తన సెల్‌లో మరణ వాంగ్మూలం లేఖ పెట్టాడు. పోలీసులు తెలిపిన వివరాలు...

గోదావరిఖనికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి నాయిని మధునయ్య (62) మల్కాపూర్ శివారులోని జర్నలిస్టు కాలనీలో ఒక ఇల్లు నిర్మించుకునేందుకు కొచ్చెర్ల ప్రవీణ్ అనే బిల్డర్‌తో రూ.40 లక్షలకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. పలు దఫాలుగా ఒప్పందాన్ని మించి రూ.60 లక్షలు చెల్లించాడు. మధునయ్య ఇంటి పక్కన ఉన్న స్థలాన్ని విక్రయిస్తానంటూ ప్రవీణ్ మధునయ్య వద్ద మరో రూ.13లక్షలు తీసుకున్నాడు. కానీ ఆ భూమిని అప్పటికే ప్రవీణ్ పెద్దపల్లి పోషయ్య అనే వ్యక్తిపేర రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం మధునయ్యకు తెలియడంతో నిలదీయగా ఆ భూమిలో ఇల్లు నిర్మించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని మాట ఇచ్చాడు. ఏడాది క్రితం బిల్డర్ ప్రవీణ్‌ను అతని భార్య లలిత హత్య చేయించింది. ఈ కేసులో లలిత జైలుకు వెళ్లి వచ్చిన తరువాత మధునయ్య ఇంటి నిర్మాణం గురించి, పక్కన ఉన్న స్థలం రిజిస్ట్రేషన్ గురించి పలు మార్లు సంప్రదించారు.

ఈ నెల 4న లలిత, పెద్దపల్లి పోషయ్యలు జర్నలిస్టు కాలనీలోని స్థలం వద్దకు రాగా మధునయ్య, మరో ఇద్దరు వ్యక్తులు వెళ్లి డబ్బుల గురించి అడిగారు. ఆ సమయంలో గొడవ జరిగి బూతులు తిట్టారని, అప్పటి నుంచి తన తండ్రి మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకున్న ట్టు మధునయ్య కొడుకు హరీష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా తన తండ్రి మృతికి కొచ్చెర్ల లలిత, పెద్దపల్లి పోషంలు కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని నాయిని హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కొచ్చెర్ల లలిత, పెద్దపల్లి పోషంలపై బీఎన్ఎస్ 108 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

వానాకాలం సాగుకు శ్రీరాంసాగర్ నీరు విడుదల


ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు అవసరాల కోసం శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నీటిని బుధవారం అధికారు లు, ప్రజా ప్రతినిధులు విడుదల చేశారు. పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద కాకతీయ కాలువ ద్వారా సాగునీటి సరాఫరాను బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా సరస్వతీ కాలువకు నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నీటి విడుదల ప్రారంభిం చారు. వానా కాలం సాగు సీజన్‌కుగాను ఎస్సారెస్పీ నీటిని రైతు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా వారాబందీ పద్ధతి లో సాగు నీటి సరాఫరా కొనసాగించనున్నట్లు అధికారులు ప్రకటిం చారు. కాకతీయ కాలువకు 1,000 క్యూసెక్కుల నీటిని, సరస్వతీ కాలువకు 100 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు, ఈఈ చక్రపాణి, పోచంపాడ్ ఎంహెచ్ఎస్ అండ్ సోలార్ సీఈ రమేశ్‌బాబు, డీఈ జె శ్రీనివాస్, డీఈఈలు,ఏఈఈలు, టీఎస్ జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ ప్రాజెక్టులు నిండుగా ఉండడం కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగు తోం ది. ఎస్సారెస్పీలోకి 11,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 46.952 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమ యానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరము లకు కలిపి ప్రాజెక్టు నుంచి 1,983 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 42.145 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

గణేశ్‌నగర్, ఆగస్టు 7: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని టీజీ ఎన్పీ డీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో గల విద్యుత్ శాఖలోని ఎం ఆర్టీ, డివిజన్‌లో గల ఎల్‌టి మీటర్స్ ల్యాబ్‌లో సెమీ ఆటోమేటిక్ టెస్ట్ బెంచ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిక రంతో అత్యంత కచ్చితత్వంతో అన్ని రకాల మీటర్లను పరీక్ష చేయవచ్చని తెలిపారు. వివిధ రకాల పరీక్షలు ఒకేసారి 20 మీటర్లుకు చేయవచ్చన్నారు. అనంతరం డివిజన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆపరేషన్ కరీంనగర్ వి.గంగాధర్, డీఈ టెక్నికల్, కరీంనగర్ విజేందర్‌రెడ్డి, కె.కాళిదాసు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న వరుణ్‌రెడ్డి

కొండగట్టులో సహస్రనామ కుంకుమార్చన

మల్యాల, ఆగస్టు 7: కొండగట్టు శ్రీ అంజనేయ స్వామి సన్నిధిలో జరుగుతున్న శ్రావణ సప్తాహ ఉత్సవాలలో భాగంగా బుధవారం అండాళ్ తిరు నక్షత్రం పురస్కరించుకొని అండాళ్ అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. ఆంజనేయస్వామికి 108 కమలాలతో అర్చన, వెంకటేశ్వరస్వామికి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజలలో ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానార్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్ అర్చకులు, వేదపండితులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 7: సిరిసిల్ల పట్టణంలోని మానేరు బ్రిడ్జి కింద బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ మృతదేహం కుళ్లిపోవడంతో నాలుగు రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతి చెందని వ్యక్తి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, నీలిరంగు షర్టు, నీలిరంగు పాయింట్ ధరించి ఉన్నాడని తెలిపారు. గుర్తించిన వారు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ 98666 20105 నంబరులో సమాచారం అందించాలని తెలిపారు.

బ్లాక్ ఫిల్మ్ ఉన్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్

-50మంది యజమానులకు జరిమానా

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7: కారు, ఇతర వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌ను అతికించుకున్న వాహనాలపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం కరీంనగర్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ ఆధ్వర్యంలో నగరంలోని బద్దం ఎల్లారెడ్డి విగ్రహం, ఎన్టీఆర్ చౌక్‌ల వద్ద తనిఖీలు నిర్వహించి కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌ను బిగించుకున్న 50 వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్ ఫిల్మ్ వాహనాలుకలిగి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్ఐ స్వామి, ఎస్ఐలు ఇషాక్‌అహ్మద్, ఉపేంద్రచారి, ఆర్ఎస్ఐ గణేష్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

-ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్

భగత్‌నగర్, ఆగస్టు 7: ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈడీ మాట్లాడుతూ శ్రావణ మాసం, రాఖీపౌర్ణమిని దృష్టిలో ఉంచుకొని ఆయా రూట్లలో బస్సులు నడపాలన్నారు. ప్రతి రోజు అదనపు కిలోమీటర్లు తిప్పి ప్రయాణికులను వారి వారి గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చి అదనపు ఆదాయం ఆర్జించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రీజినల్ మేనేజర్లు సాలమన్, కె జానిరెడ్డి, ఎన్.సుచరిత, సరిరాం, డిప్యూటి రీజినల్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

ఆర్ఎంను సన్మానించిన ఈడీ

భగత్‌నగర్, ఆగస్టు 7: కరీంనగర్ జోన్‌లో అత్యధిక వృద్ధి రేటు సాధించిన కరీంనగర్‌రీజినల్ మేనేజర్ ఎన్ సుచరితను జోన్ ఈడి వినోద్‌కుమార్ సన్మానించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం జులై మాసాంతం వరకు కరీంనగర్ జోన్‌లోని అన్ని రీజియన్‌లలో అత్యధిక వృద్ధి రేటు సాధించిన కరీంనగర్ రీజియన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమలో జోన్ పరిధిలోని అనిన రీజియన్‌ల రీజినల్ మేనేజర్‌లు, డిప్యూటి రీజనల్ మేనేజర్స్ (ఆపరేషన్స్), డిప్యూటి చీఫ్ అకౌంట్ ఆఫీసర్‌లు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 7: ప్రథమ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థులు పతకాలు సాధించారు. బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన జయరామ్ కటా విభాగంగంలో బంగారు పతకాన్ని, ఎస్‌పి క్రిష్ణచైతన్య కరాటేలోని కటా విభాగంలో రజత పతకాలు సాధించడం అభినందనీయమన్నారు.

చేనేత వస్త్రాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

హుజూరాబాద్, ఆగస్టు 7: హుజూరాబాద్ పట్టణంలోని చేనేత వస్త్రాలయాన్ని బుధవారం ఆల్ఫోర్స్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల తయారీ, వాడకం, నేయడం లాంటివి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ చేనేత అనేది కళాత్మక నైపుణ్యమన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంపై సమగ్ర చర్చ జరగాలి

భగత్‌నగర్, ఆగస్టు 7: విద్యారంగంపై సమగ్రమైన చర్చ జరగాలని యుఎస్ఎఫ్ఐ ఆహ్వానసంఘం సన్నాహక సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భారత ఐక్యవిద్యార్థి ప్రదర్శన (యుఎస్ఎఫ్ఐ) ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌ఛార్జి నేదురు తిరుపతి, నిగమ విద్యాసంస్థల చైర్మన్ బిఆర్ గోపాల్‌రెడ్డి, సామాజికవేత్త అరుణ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 12, 13, 14 తేదీల్లో యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాలను విజయవంతం చేయాలన్నారు.విద్యార్థుల్లో సామాజిక దృక్పదం తగ్గిపోతుందని, దానిని అడ్డుకట్టవేసే బాధ్యత విద్యార్థి సంఘాలపై ఉందన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మాదం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రాజేష్‌నాయక్, చదిలాపురం మధు, పొన్న సంపత్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంద గణేష్, రాహుల్, నాయకులు మల్లిఖార్జున తిరుపతికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాసుల పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 8: మండలంలోని చెల్పూర్ ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థులకు బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ వి రవీంద్రనాథ్ విద్యార్థులకు ఉచితంగా బస్ పాసులను పంపిణీ చేశారు. చెల్పూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుకర్ తన సొంత ఖర్చులతో బస్ పాసులను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అనురాధ, అన్నపూర్ణ, ఆర్టీసీ సిబ్బంది సారయ్య, సాయి చరణ్, ఐలయ్య, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మరమగ్గాల కార్మికుల దీక్షలు విరమణ

గంగాధర, ఆగస్టు 7: మరమగ్గాల కార్మికులకు ఆర్డర్లు కల్పించేలా చొరవ తీసుకుంటానని తహసీల్దార్ అనుపమ కార్మికులకు హామీ ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. 14 రోజులుగా గర్షకుర్తిలో మరమగ్గాల కార్మికులు చేస్తున్న దీక్షల్లో భాగంగా బుధవారం మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేసి అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దీక్ష శిబిరాన్ని సందర్శించి నిరసన కారుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆర్డర్లను అందించి ఉపాధిని కల్పించేందుకు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతానని అన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు నిమ్మరసం అందించి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో పద్మ శాలీ సేవా సంఘం మండలాధ్యక్షుడు సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిందం రాజమౌళి, లచ్చయ్య, కార్మికసంఘం అధ్యక్షుడు గడ్డం నారాయణ, వస్త్రోత్పత్తి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఆలువాల విఠోబా, నాయకులు అన్నల్‌దాస్ శ్రీనివాస్, గుండా రాజేశం పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు

మానకొండూర్, ఆగస్టు 7: ఆయిల్‌పామ్ సాగుతో అధిగ దిగుబడులు సాధించవ చ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ఆర్ శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మానకొండూర్‌లోని రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సాంప్రదాయ నూనె గింజల కన్నా ఆయిల్ పామ్‌తో ఐదురెట్లు అధిక అధిక దిగుబడి వస్తుందన్నారు. పంట సాగుకు అనుకూలమైన పరిస్థితులు, దిగుబడి వచ్చే విధానం, మార్కెటింగ్ సౌకర్యంపై ఆయన వివరించారు. మొక్కకు ఇవ్వవలసిన పోషకాలు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు, గెలలు కోయడం, అంతర పంటల నుంచి వచ్చే ఆదాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉద్యానవన అధికారి రవళి, లోహియా గ్రూప్ మేనేజర్ భరత్, ఫీల్డ్ అధికారి రాజేందర్ పాల్గొన్నారు.

జోరుగా అక్రమ వెంచర్లు

గన్నేరువరం, ఆగస్టు 7: మండల కేంద్రం చుట్టుపక్కల అక్రమ వెంచర్లు జోరు గా వెలుస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిపిస్తున్నాయి. వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేయకుండానే రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. భూములు కొని నాలా అనుమతులు లేకుండానే వెంచర్లు చేసి అమ్ముతున్నారు. రియల్టర్లు ఎకరాల కొద్ది భూమిని కొని ఎటువంటి నిబంధనలు పాటించకుండా ప్లాట్లు చేసి అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు అందిన తర్వాత వెంచర్లకు వెళ్లి హద్దురాళ్లు తొలగించడం మినహా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

18 వరకు ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లు

హుజూరాబాద్, ఆగస్టు 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో దూర విద్యా విధానంలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, సర్టిఫికెట్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 18వరకు అవకాశం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 18లోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9849970783, 7382929650 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, ఆగస్టు 7: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్ర మాన్ని ప్రారంభించిందన్నారు. అధికారులు అన్ని మండలాల్లో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రతి ఇంట్లో కనీసం ఆరు మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తుందని తెలిపారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్ర పరచా లని, క్లోరోస్కోప్ ద్వారా తాగునీటి పరీక్షలు చేసి నాణ్యమైన తాగునీరు అందించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో ప్రభు, మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కరీంనగర్ రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. కరీంనగర్ మండలంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను నిర్వహించారు. జూబ్లీనగర్, ఫకీర్‌పేట గ్రామాల్లో ఆర్డీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో మురికి కాలువలు శుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, మాజీ సర్పంచ్ రుద్ర రాము పాల్గొన్నారు. గోపాల్‌పూర్ గ్రామంలోని స్కూల్, మైదాన ప్రాంతాల్లో శ్రమ దానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఆశ వర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లు, కార్యదర్శి, మహిళా సంఘాల మహిళలు, పలువురు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: కరీంనగర్ అర్బన్ సవరాన్ స్ట్రీట్ సెక్టార్ బుట్టిరాజారాం కాలనీ-1 సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి సూపర్‌వైజర్ రాజమని పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. పిల్లల పెరుగుదల, ఆరోగ్య విషయాలు, పరిశుభ్రత తదితర అంశాలను తల్లులకు వివరించారు. చిన్న పిల్లలకు అప్పుడే పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు పట్టించడంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాల వారోత్సవాలకు తల్లులు, గర్భవతులు, పిల్లలతోపాటు బాలింతలు హాజరయ్యారు. ఈకార్యక్రమంలో టీచర్లు ఎల్.శ్రీలత, ఆయా ఎల్లమ్మ, తల్లులు, బాలింతలు, గర్భవతులు, పిల్లలు పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: గుంటూరు పల్లి అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులు ఐసీడీఎస్ సూపర్ వైజర్ నిర్మాల అన్న ప్రాసన , అక్షరాభ్యాసం చేయించారు. ఈకార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ రజియా బేగంతో పాటు తల్లులు, నాయకులు పాల్గొన్నారు.

●జమ్మికుంట రూరల్: ముర్రుపాలు శిశువుకు సంజీవని లాంటివని హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పాలిచ్చే తల్లులకు, గర్భవతులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ప్రతి రోజు ఎనిమిది నుండి పది సార్లు బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులు గర్భాశయ క్యాన్సర్ నుండి రక్షించబడుతారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ రమ, ఆశాకార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు, పాలిచ్చే తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు7: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చిన ఉద్యోగాలలో భాగంగా నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ ఉద్యోగం సంపాదించిన మామిడి హరికృష్ణరెడ్డిని స్థానిక రాంచంద్రాపూర్ కాలనీ వాసులు బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నుల్లయ్యగారి ఇంద్రసేనారెడ్డి, సురేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, ఉప్పు దామోదర్, భూమయ్య తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో ఆండాళ్ తిరునక్షత్రం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 7: నగరంలోని పలు వైష్ణవ ఆలయాలైన మంకమ్మతోట, మార్కెట్‌రోడ్, విద్యానగర్, జ్యోతి నగర్, కట్టరాంపూర్ వేంకటేశ్వ రాలయాల్లో, సప్తగిరికాలని, వావిలాపల్లి రామాలయాల్లో, విశిష్టాద్వైతపరుల గృహాలు, వేదభవనం, ఆండాళ్‌భవనంలో ఆండాళ్‌దేవి తిరునక్షత్రాన్ని (జన్మదినం) భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించు కున్నారు. ఆలయాలు అమ్మవారి అభిషేక అర్చనలు, పూజలతో మార్మోగాయి. యజ్ఞవరాహక్షేత్రంలో అమ్మవారికి విశేష స్నపన తిరుమంజనం, అమ్మవారు రాసిన నాచ్చియార్ తిరుమొళి సేవాకాలం చేశారు. కార్యక్రమాల్లో ఆయా ఆలయాల నిర్వాహకులు, ఈఓలు పాల్గొన్నారు.

నేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: చేనేత కార్మికుల జీవన పరిస్థితులు మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చేనేత పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు బుధవారం చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత కార్మికుల సంక్షేమం కోసం కొన్ని ప్రతిపాదనలు చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్, సిరిసిల్ల, వరంగల్, నల్గొండ, ఇతర జిల్లాలో చేనేత పరిశ్రమపై దాదాపు 50వేల మంది జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అనేక మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత, వస్త్రోత్పత్తి రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో దామాషా ప్రకారం తగిన నిధులు కేటాయించడం లేదని ఆవేదన చెందారు. నేతన్నకు చేయూత నిధులను పెంచాలని, చేనేత రుణాల మాఫీ పథకాన్ని అమలు చేయాలని కోరారు. చేనేత సంఘాలకు పావలా వడ్డీ అమలు చేస్తున్నా పూర్తిస్థాయిలో ప్రయోజనం కలుగడం లేదని, ప్రభుత్వం వారి సంక్షేమంపై దృష్టి సారించాలని కోరారు.

పంచాయతీ భవనాల నిర్మాణంలో జాప్యం

-ఏడాదిగా సాగుతున్న పనులు -పట్టించుకోని ఉన్నతాధికారులు



ఇరుకుల్ల గ్రామంలో స్లాబ్ లెవ్‌లో నిలిచిన పనులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 7: కరీంనగర్ రూరల్ మండలంలో పంచాయతీ భవనాల నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో సిబ్బంది, గ్రామస్థులు గ్రామ సభలకు, రోజువారీ కార్యకలాపాలకు పక్కా భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ఆరేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఆరంభంలో పంచాయతీ కార్యాలయాలను ప్రభుత్వ పాఠశాల భవనాలు, కమ్యూనిటీ భవనాలు, అద్దె గృహాల్లో నిర్వహించారు. పాలకవర్గాలు, అధికారుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం కరీంనగర్ మండలంలో కొత్తగా ఏడు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో భవనానికి 20లక్షల రూపాయలు కేటాయించింది. సర్పంచులు తమ పదవీ కాలంలోనే పూర్తి చేయాలని సంకల్పిం చినప్పటికి నిధుల విడుదల జాప్యమవుతుందనే కారణంతో ముందుకు రాలేదు. అధికారుల ఒత్తిడితో కొన్ని గ్రామాల్లో పనులు చేపట్టినప్పటికీ అర్థాతరంగా నిలిపి వేశారు. చేసిన పనులకు కూడా నిధులు రాలేదని వాపోతున్నారు. పలు భవనాలు చివరి దశకు చేరుకున్నా నిధులు సరిపోకపోవడంతో పనులను ఆపేశారు. గోపాల్‌పూర్‌లో భవన నిర్మాణాన్ని ప్రారంభించక పోవడంతో నిధులు వృథాగా మారాయి. జూబ్లీనగర్‌లో కేవలం పిల్లర్ల కోసం సలాక మాత్రమే వేసి విడిచి పెట్టారు. పునాది దశలోనే నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇరుకుల్లలో స్లాబ్ వేశారు. దుబ్బపల్లి, మందులపల్లి గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తి కాగా చిన్న చిన్న పనులు చేయాల్సి ఉంది. దీంతో ఆయా పంచాయతీ కార్యాలయాలను ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నారు. అయితే వరుసగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పాటు బిల్లులు మంజూరు కాకపోవడంతో భవనాల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

●బొమ్మకల్ జీపీ భవన నిర్మాణం వివాదాస్పదం

బొమ్మకల్ గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం వివాదాస్పదంగా మారడంతో పనులు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయని సర్వే నెంబర్ 17బైఎలోని ప్రైవేటు స్థలంలో సుమారు 80లక్షల అంచనా వ్యయంతో ఓ మాజీ ప్రజాప్రతినిధి అనచరుడు భవన నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులు పూర్తి కాకుండానే జనవరిలో అప్పటి సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్ అధికారికంగా ప్రారంభించారు. కాగా ప్రైవేటు స్థలంలో పంచాయతీ భవన నిర్మాణంపై మాజీ వార్డు సభ్యులు తోట కిరణ్ కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిర్మాణదారుడికి 10.38లక్షల బిల్లును పంచాయతీ నిధుల నుంచి చెల్లించారని, అక్ర మ నిర్మాణంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చొప్పదండిలో నేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్ గుర్రం నీరజ

చొప్పదండి, ఆగస్టు 7: పట్టణంలో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు దండె రాజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి వల్లాల కృష్ణహరి, నాయకులు మహేశుని మల్లేశం, దండె కృష్ణ, ఎలిగేటి తిరుపతి, దండె లింగన్న, దూస రాము, లక్ష్మినర్సయ్య, చిన్న గంగారాం, వల్లాల నగేశ్, హరికిషన్ పాల్గొన్నారు.

● రామడుగు: చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేనేత బంధును అమలు చేయాలని పద్మశాలి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక కమలాకర్ కోరారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మోతె గ్రామంలోని చేనేత కార్మికులను సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, పద్మశాలి సంఘం నాయకులు శంకరయ్య శంకర్, పంతగాని శ్రీధర్, కొలిపాక అజయ్ పాల్గొన్నారు.

● గంగాధర: గర్షకుర్తిలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పద్మశాలీ సేవా సంఘం, వస్త్రోత్పత్తి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చేనేత విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవాసంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిందం రాజమౌళి, లచ్చయ్య, కార్మిక సంఘం అధ్యక్షుడు గడ్డం నారాయణ, వస్త్రోత్పత్తి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఆలువాల విఠోబా, నాయకులు అన్నల్‌దాస్ శ్రీనివాస్, గుండా రాజేశం పాల్గొన్నారు.

'ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి'

హుజూరాబాద్, ఆగస్టు 7: చేవెళ్లలో కాంగ్రెస్ ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని కోరుతూ హుజూరాబాద్ తహసీల్దార్ కనకయ్యకు బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ అభయహస్తం కింద ప్రతి కుటుంబానికి 12లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, తూర్పాటి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, శ్రీనివాస్, శశిధర్, రమేష్, వేణు, సారయ్య, నగేష్, రాజశేఖర్, వెంకటేష్, అనిల్, సాయి పాల్గొన్నారు.

● శంకరపట్నం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రకటించిన విధంగా ఎస్సీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకం సాగర్, మాడ వెంకట్‌రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి, దండు కొంరయ్య, జైపాల్, నరేందర్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



జమ్మికుంటలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, ఆగస్టు 7: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో వంద మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న కోటి, తహసీలార్ రమేష్‌బాబు, కమిషనర్ మహమ్మద్ అయాజ్ పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో 76 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, సింగిల్ విండో వైస్ చైర్మన్ కందాల కొంరెల్లి పాల్గొన్నారు.

● వీణవంక: మండల కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి 16 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం'



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్, ఆగస్టు 7: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య బుధ వారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, సుగుణ, తులసీదాస్, మల్లారెడ్డి, విజేందర్‌రెడ్డి, మురళి, సుహాసిని, శైలజ పాల్గొన్నారు.

● సైదాపూర్: మండలంలోని వెన్కేపల్లి ఉన్నత పాఠశాలలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వాడి పడేసే ప్లాస్టిక్ నియంత్రణపైన విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, మండల అభివృద్ధి అధికారి యాదగిరి, పంచాయతీ ప్రత్యేకాధికారి విజయేం దర్‌రావు, వేణుప్రసాద్, రవీందర్, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ

సుభాష్‌నగర్, ఆగస్టు 7: లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. బుధవారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పండ్లు, బ్రెడ్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజక వర్గ ఇంచార్జీ పురమల్ల శ్రీనివాస్, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ నవీన, క్లబ్ అధ్యక్షుడు కామిరెడ్డి నరసింహరెడ్డి, కార్యదర్శి బట్టు రాజేందర్, జోన్ చైర్మెన్ చింతల కిషన్, క్యాబినెట్ మెంబర్ మాసినేని చక్రధర్, రావికంటి భాగ్యలక్ష్మి, రావికంటి కృష్ణకిషోర్, కొంజర్ల నవీన్, మంద విష్ణువర్ధన్‌రెడ్డి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్ పునాదికి స్టూడెంట్ కౌన్సిల్ దోహదం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: విద్యార్థుల భవిష్యత్ పునాదికి స్టూడెంట్ కౌన్సిల్ దోహదపడుతుందని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మానేరు పాఠశాలలో జరిగిన స్టూడెంట్ కౌన్సిల్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులకు అన్ని విషయాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, జహేద పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని గొప్ప నాయకుడిగా ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా ఎన్నికైన విద్యార్థుల ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలను పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ డి.వినోద్‌కుమార్, డైరెక్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: నగరంలోని తొమ్మిదవ డివిజన్ ఆటోనగర్‌లో ఆల్ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణ పనులకు మేయర్ యాదగిరి సునీల్‌రావు భూమి పూజ చేశారు. టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ భవన నిర్మాణానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎంపీ ల్యాడ్స్ ఐదు లక్షలను మంజూరీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మేయర్‌ను ఘనంగా సన్మానించారు. సంఘ సభ్యులు, కార్పొరేటర్ కోరిక మేరకు స్థల కంపౌండ్ వాల్ నిర్మాణానికి నగరపాలక సంస్థ ద్వారా 10 లక్షల రూపాయల నిధులు ఇస్తామని ప్రకటించారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు సహకరిస్తానని హామీ ఇచ్చారు.

పీఆర్‌టీయుజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేశ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 7: పీఆర్‌టీయుజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గంగాధర మండలంలోని గంగాధర ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న చిందం రమేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పారమితలో ఇంటింటా ఇన్నోవేటర్‌పై అవగాహన సదస్సు

భగత్‌నగర్, ఆగస్టు 7: పారమిత హెరిటేజ్ పాఠశాలలో ఇంటింటా ఇన్నోవేటర్-2024పై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో మేనేజర్ శ్రీరామ్ శ్రీనివాస్, కరీంనగర్ ఇన్నోవేషన్ కో-ఆర్డినేటర్స్ మణి దీప్, విష్ణు, పాఠశాల డైరెక్టర్ టిఎస్‌వి రమణ, ప్రధానోపాధ్యాయులు హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రబీంద్రపాత్రో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌కు భూమి పూజ

భగత్‌నగర్, ఆగస్టు7: కొత్తపల్లి మండలంలోని ఖాజీపూర్‌లో ఎస్‌డిఎఫ్ నిధులతో ఓపెన్ జిమ్, హైమాస్ లైట్లను కరీంనగర్ అసెంబి నియోజక వర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కాళిదాస్, భాగ్యలక్ష్మి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పంజాల సామిగౌడ్, అవుడగోని శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

●భగత్‌నగర్: కరీంనగర్‌లో నివాసముంటున్న మాస్టిన్ (ఎస్సీ) కులస్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని దళిత హక్కుల పోరాట సమితి కరీంనగర్ ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి కోరారు. నగరంలో ఏర్పాటు చేసిన మాస్టిన్ కులస్తుల సమావేశానికి హాజరై మాట్లాడారు. సమావేశంలో డిహెచ్‌పిఎస్ నాయకులు రమేష్, బాబురావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● వీణవంక: మండల కేంద్రంలో ఆర్టీసి కార్గో సేవలను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు.

-మండలంలోని గంగారంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న గూడ్స్ క్యారియర్ వాహనాన్ని పట్టుకుని ఓనర్, డ్రైవర్ అలకుంట వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

● హుజూరాబాద్: చేనేత సంఘం పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి ఉపేందర్ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైద్రాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డును అందుకున్నారు.

- హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన రావులకారి కల్యాణ్ బుధవారం డాక్టరేట్ అందుకున్నాడు.

● శంకరపట్నం: పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని ఎంపీడీవో కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం శంకరపట్నం మండలం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

- శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్సులిన్ ఇతర మందులు లేవని సయ్యద్ ఆరిఫ్ వైద్యాధికారి శ్రావణ్‌కు ఫిర్యాదు చేశారు.

- మండలం మొలంగూర్ మాజీ ఎంపీటీసీ ఎస్కే మోయిన్ (43) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు.

● చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయుశ్మాన్ భారత్ లో బాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు ప్రాదమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రేమ్‌సాగర్ తెలిపారు.

- తమ సమస్యలను పరిష్కరించాలని గురుకుల అభ్యర్థులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల నియమకాల్లో బ్యాక్‌లాగ్‌లు లేకుండా చూడాలన్నారు.

● రామడుగు: మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని కోరుతూ హైద్రాబాద్‌లోని గాంధీభవన్ లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి పాల్గొన్నారు.

- మండలంలోని వెదిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో పాల్గొన్నారు.

● గంగాధర: మండలం గట్టుబూత్కుర్‌కు చెందిన రామంచ బాబు, ఓరుగంటి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి వారి కుటుంబాలను పరామర్శించి ఐదు వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

● మానకొండూర్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురష్కరించుకొని కరీంనగర్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మానకొండూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ గంగాపావని ద్వితీయ స్థానం సాధించింది. ఆమెకు కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ బహుమతి అందజేశారు.